సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



# గాలివాన బీభత్సం



ఇది కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన నక్క మల్లేశం కోళ్లఫారం. వ్యవసాయానికి అనుబంధంగా కోళ్ల షెడ్డు వేసుకోగా.. గాలివానతో రేకుల షెడ్డు నేల మట్టమైంది. అందులో ఇప్పుడు కోళ్లు లేకపోవడంతో షెడ్డు గోడలతో సహా కూలిపోయింది. జిల్లాలో గాలి వాన బీభత్సానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. కరెంట్ లేని పల్లెల్లో జనం బిక్కుబిక్కుమంటూ.. చీకట్లో గడుపుతున్నారు.

- కూలిన షెడ్లు.. విరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు
- చేతికొచ్చిన వరి.. మామిడి నేలమట్టం
- అకాల వర్షం.. అపార నష్టం
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారీ నష్టాలు

**సిరిసిల్ల/కోనరావుపేట/బోయినపల్లి/రుద్రంగి(వేములవాడ)/వీర్నపల్లి(సిరిసిల్ల):** ఊహలకందని వేగంతో దూసుకొచ్చిన గాలి.. వేగంగా విసిరి కొట్టే రాళ్లు.. అంతే తీవ్రతతో కురిసే వర్షం.. సరిగ్గా 15 నిమిషాల్లో కోతకొచ్చిన వరి, కాపుకొచ్చిన మామిడి.. కోళ్ల ఫారాలు, పూరిండ్లు.. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. తెగిపోయిన విద్యుత్ తీగలతో నిలిచిపోయిన విద్యుత్ సరఫరాతో పల్లెల్లో చీకట్లు కమ్ముకున్నాయి. ఇది రాజన్న సిరిసిల్ల జిల్లాలో శనివారం సాయంత్రం ప్రకృతి సృష్టించిన గాలి.. రాళ్ల వాన.. బీభత్స దృశ్యాలు. ఆరుగాలం శ్రమించిన అన్నదాతలు నేలరాలిన వరిగింజలను చూసి గుండెలవిసేలా రోదిస్తున్నారు. కళ్ల ముందే రెక్కల కష్టం నేలపాలైందని బాధితులు కన్నీరు పెడుతున్నారు.

రాజన్నసిరిసిల్ల జిల్లాలో శనివారం గాలివాన బీభత్సం సృష్టించింది. కోనరావుపేట మండలంలోని బావుసాయిపేటలో రైతు పంబాల భద్రయ్యకు చెందిన మామిడితోటలోని కాయలు పూర్తిగా రాలిపోయాయి. నక్క మల్లేశంకు చెందిన కోళ్లఫారం షెడ్డు కూలింది. మండలవ్యాప్తగా ఐదు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.

**బోయినపల్లి మండలంలో..**

**బోయినపల్లి(చొప్పదండి):** మండలంలోని తడగొండ, బోయినపల్లి, బూర్గుపల్లి, అనంతపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. స్థానిక మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పల మధ్య నుంచి వర్షం నీరు వెళ్లేందుకు కాల్వలు తీశారు. తడగొండ, అనంతపల్లి గ్రామాల్లో మామిడికాయలు రాలిపోయాయి.

**అకాల వర్షం.. అపార నష్టం**

వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి, శాంతినగర్, గర్జనపల్లి గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి వరిధాన్యం తడిసింది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. కోత దశలో ఉన్న వరి పంట నేలపాలైంది.

**రుద్రంగిలో వడగండ్లు**

రుద్రంగి మండలంలో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వడగండ్ల వానకు పంట చేనులు పాడయ్యాయి. మరికొద్ది రోజుల్లో చేతికొస్తుందనుకున్న వరిపంట ఈదురుగాలులతో నేలవాలింది. శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. ధాన్యం కొట్టుకుపోయింది. మామిడికాయలు రాలిపోయాయి. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభించి, తూకం మొదలుపెట్టాలని రైతులు కోరుతున్నారు.

**వేములవాడరూరల్:** మండలంలోని ఫాజుల్‌నగర్, బాలనగర్ గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. హఠాత్తుగా వచ్చిన వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్‌లు కప్పేందుకు ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా పోయింది.



ఇద్దరు పిల్లలతో కన్నీరు పెడుతూ.. కూర్చున్న ఈమె పేరు సుల్తాన్ కనకవ్వ. కోనరావుపేట మండలం బావుసాయిపేట. కూలి పనిచేస్తూ పిల్లల్ని పోషిస్తుంది. ఆమె భర్త రాజయ్య మలేషియా వెళ్లి నష్టపోయాడు. మళ్లీ ఇటీవల దుబాయికి వెళ్లాడు. గాలి వానకు ఆమె పూరిల్లు ఎగిరిపోయింది. ఇంట్లోని సామగ్రి తడిసి పోయింది. ఇద్దరు పిల్లలతో కన్నీరు పెడుతూ..అయ్యో దేవుడా ఏమిటీ మా గతి అంటూ రోదిస్తోంది. తల్లిని చూసి పిల్లలు కన్నీరుపెడుతున్నారు.



ఇతని పేరు పంబాల భద్రయ్య. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన భద్రయ్య స్థానికంగా తిరుపతిరెడ్డికి చెందిన మామిడి తోటను రూ.1.20లక్షలకు కౌలుకు తీసుకున్నారు. కంటికి రెప్పలా కాయల్ని కాపాడుకోగా.. గాలివాన బీభత్సంతో మామిడి కాయలు, చెట్లు నేల రాలాయి. అప్పులు చేసి తీసుకున్న తోట కాయలు రాలడంతో భద్రయ్య కన్నీరు పెడుతున్నాడు.



ఈ ఫొటోలో తడిసిన ధాన్యం చూపుతున్న రైతు పేరు వంగపెల్లి దేవరాజు. కోనరావుపేట మండలంలోని కనగర్తి గ్రామం. తనకు ఉన్న నాలుగు ఎకరాల్లో వరిపంట సాగు చేశాడు. కోసిన ధాన్యాన్ని గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ఆరబోయగా.. శనివారం కురిసిన వర్షానికి తడిసి ముద్దయ్యింది. కేంద్రం నిర్వాహకులు టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో వర్షం నుంచి ధాన్యాన్ని తడువకుండా కాపాడుకోలేకపోయాడు. దీంతో ధాన్యం పూర్తిగా తడిసింది. మూడు రోజుల క్రితం ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చాడు. అయితే కొనుగోలు కేంద్రాన్ని ఇప్పటి వరకు ప్రారంభించలేదు.



వీర్నపల్లిలో తడిసిన ధాన్యం




బావుసాయిపేటలో నేలవాలిన ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం



బోయినపల్లిలో తడిసిన ధాన్యం

## భక్తిశ్రద్ధలతో రంజాన్



సిరిసిల్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, సందేశం వినిపిస్తున్న మతపెద్ద



వేములవాడలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

**సిరిసిల్లటౌన్/వేములవాడ:** రంజాన్ పర్వదినం వేడుకలను శనివారం సిరిసిల్లలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నెల రోజులపాటు ఉపవాస దీక్షలు కొనసాగించిన వారు రంజాన్‌ను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషాల మధ్య జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతగురువులు మాట్లాడుతూ రంజాన్ స్ఫూర్తిని సోదరభావాన్ని నిరంతరం కొనసాగించాలని సూచించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య తదితరులు ముస్లింలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



## సిరిసిల్ల మెడికల్ కాలేజీకి వంద సీట్లు

- ఎన్ఎంసీ అనుమతి మంజూరు
- ఈ ఏడాది నుంచే వైద్య విద్యాబోధన
- ఆగస్టులో ఎంబీబీఎస్ ప్రవేశాలు
- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కేటీఆర్
- జిల్లా ప్రజలపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక అభిమానమని కితాబు



తుది దశకు చేరిన మెడికల్ కాలేజీ భవనం

**సిరిసిల్ల:** జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైంది. వైద్యవిద్యను బోధించే మెడికల్ కాలేజీని మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) లెటర్ ఆఫ్ ఇన్‌టెంట్(ఎల్‌వోటీ)ని శుక్రవారం జారీ చేసింది. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీకి వంద ఎంబీబీఎస్ సీట్లను కేటాయించారు. ఈ ఏడాది ఆగస్టులో అడ్మిషన్లు మొదలవుతాయి.

**మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు**

అధికారికంగా మెడికల్ కాలజీ మంజూరుకావడంతో జిల్లా ప్రజల తరఫున సీఎం కేసీఆర్‌కు సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కె.తారక రామారావు శనివారం కృతజ్ఞతలు తెలిపారు. అన్ని రకాల సహకారాలు సీఎం కేసీఆర్ అందించారని పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రిని 300 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. జిల్లా ప్రజలపై సీఎంకు ప్రత్యేక అభిమానమని కేటీఆర్ కితాబిచ్చారు.

**నెరవేరిన స్వప్నం**

జిల్లా ఆవిర్భావంతో మెడికల్ కాలేజీ మంజూరు చేయాలనే డిమాండ్ తెరపైకొచ్చింది. సిరిసిల్ల ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ మెడికల్ కాలేజీ ఏర్పాటు ఆకాంక్షను గుర్తించారు. సీఎం కేసీఆర్ కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా మంత్రి కేటీఆర్ కోరిక మేరకు మెడికల్ కాలేజీ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. 2022లో జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైంది. అయితే ఎన్ఎంసీ శుక్రవారం అధికారికంగా ఆమోదం తెలిపింది.

**పెద్దూరు వద్ద మెడికల్ కాలేజీ**

సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరు వద్ద రెండో బైపాస్ రోడ్డులో పది ఎకరాల్లో మెడికల్ కాలేజీ, హాస్టల్ ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు భవనం పనులు తుదిదశకు చేరాయి. 500 పడకల ఆస్పత్రితో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. జిల్లాలోని పేదలకు ఉచిత వైద్యసేవలు అందనున్నాయి. ఆధునిక హంగులతో మెడికల్ కాలేజీ భవనం, హాస్టల్ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. ల్యాబోరేటరీ భవనం పూర్తయింది. సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రిని బైపాస్ రోడ్డులోని మెడికల్ కాలేజీకి తరలిస్తారు. ఇక్కడే అన్ని రకాల వైద్యసేవలు అందిస్తారు. సిరిసిల్లలో ఉన్న జిల్లా ఆస్పత్రిని మాతాశిశు సంరక్షణ కేంద్రంగా మార్చుతారు. ఇక్కడ ప్రసూతి సేవలకు, నవజాత శిశువులకు వైద్యసేవలు అందిస్తారు. మిగతా అన్ని రకాల వైద్యసేవలు, శస్త్రచికిత్సలు, అత్యవసర సేవలు, పోస్టుమార్టం వంటి వాటిని మెడికల్ కాలేజీలోనే చేస్తారు. దీంతో సిరిసిల్లలో వైద్యుల కొరత తీరుతుంది. 24 గంటలు వైద్యవిద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలు అందిస్తారు. అత్యవసరమైన సేవలకు కరీంనగర్, హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లకుండా ఇక్కడే.. ఆధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయి. జిల్లా ప్రజలకు ఉచితంగా ఆధునిక వైద్యం అందుబాటులోకి త్వరలోనే రానుంది.

**ఈ ఏడాది అడ్మిషన్లు**



రాజన్నసిరిసిల్ల మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ నుంచి లెటర్ ఆఫ్ ఇన్‌టెంట్ (ఎల్‌వోఐ) మంజూరైంది. వంద ఎంబీసీఎస్ సీట్లను కేటాయించారు. ఇంకా కొంత అడ్మినిస్ట్రేషన్ కరస్పాండెంట్ ప్రాసెస్ చేయాల్సి ఉంది. సోమవారం పూర్తి చేస్తాం. ఈ ఏడాది ఆగస్టులో అడ్మిషన్లు మొదలవుతాయి. సొంత భవనంలోనే మెడికల్ కాలేజీని ప్రారంభిస్తాం.

– డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సిరిసిల్ల

## క్లుప్తంగా

### ఎమ్మెల్యే దత్తత గ్రామంలో అభివృద్ధి ఏదీ?

- బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్



మాట్లాడుతున్న వెంకటేశ్

**రుద్రంగి(వేములవాడ):** వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు రుద్రంగి గ్రామాన్ని దత్తత తీసుకొని చేసిన అభివృద్ధి ఏమి లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్యాడపు వెంకటేశ్ విమర్శించారు. రుద్రంగిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రుద్రంగిలో ధ్వంసమైన రోడ్లు, కంపుకొడుతున్న డ్రెయినేజీలే దర్శనమిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాల పేరుతో అబద్ధాల సమ్మేళనాలు చేసుకుంటుందని ఎద్దేవా చేశారు. కేంద్రం ఇస్తున్న నిధులతో జరుగుతున్న పనులను తాము చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు.

### ఫెయిల్ అయిన విద్యార్థులకు మరో అవకాశం

**వేములవాడఅర్బన్:** పాలిటెక్నిక్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు అగ్రహారం ఎస్సారార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ శనివారం తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కోర్సులలో గతంలో చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు సాంకేతిక విద్యాశాఖ ప్రత్యేక అవకాశం కల్పించిందన్నారు. 2023 జూన్‌లో పరీక్షలు నిర్వహిస్తారని, దరఖాస్తుకు ఈనెల 24 వరకు అవకాశం ఉందని తెలిపారు.

### మద్యం తాగి వ్యక్తి మృతి

**వేములవాడఅర్బన్:** వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులో నివసించే బాబర్ అర్జున్(37) అతిగా మద్యం తాగి శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బాబర్ అర్జున్ సంచారజీవి. మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో శనివారం అతిగా మద్యం తాగి మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

# మార్కెట్ గోదాంలో ప్రైవేటు ధాన్యం !

- బోయినపల్లిలో భారీగా ధాన్యం నిల్వలు
- ఖాళీ చేయాలన్న నోటీసులు బేఖాతర్
- రూ.10 లక్షల మేర మార్కెట్ ఆదాయానికి గండి
- వేములవాడ రైస్‌మిల్లర్స్ నిర్వాకం



బోయినపల్లి మార్కెట్ యార్డులోని గోదాం

**బోయినపల్లి(చొప్పదండి):** ప్రభుత్వానికి చెందిన మార్కెట్ గోదాంలో ప్రైవేట్ మిల్లర్లు ధాన్యం నిల్వ చేసుకున్నారు. ప్రభుత్వ అనుమతులు దాటినప్పటికీ వ్యాపారులు ఖాళీ చేయడం లేదు. గడువు పొడగింపు ఆదేశాలు తెచ్చుకుంటామంటూ కాలయాపన చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండి పడుతుంది. ధాన్యం ఖాళీ చేయాలని ఇటీవల మార్కెటింగ్‌శాఖ అధికారులు పంపిన నోటీసులను సైతం మిల్లర్లు ఖాతరు చేయడం లేదు.

### 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం

బోయినపల్లి మార్కెట్ యార్డులో 2017లో రూ.3 కోట్ల అంచనాలతో 5 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాంను నిర్మించారు. గోదాంలో మూడు బ్లాక్‌లు ఉన్నాయి. ప్రతీ బ్లాక్‌లో 1,666 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వం చేసే సామర్థ్యం ఉంది. గత రెండు సీజన్ల నుంచి వేములవాడకు చెందిన మూడు రైస్‌మిల్లులకు సంబంధించిన ధాన్యాన్ని మూడు బ్లాక్‌లలో 3,500 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని నిల్వ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు 2022 ఏప్రిల్ నెలతో ముగిసింది. గడువు ముగియడంతో గోదాంలోని ధాన్యం నిల్వలు ఖాళీ చేయాలని మార్కెట్ కార్యదర్శి వ్యాపారులకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అయితే ఒక మిల్లుకు చెందిన వారు సగం మేరకు ఖాళీ చేసినట్లు తెలిసింది. ఇంకా సగం ధాన్యం గోదాంలోనే ఉంది.

### రూ.10 లక్షల మేర అద్దె బకాయిలు

మార్కెట్ గోదాంలోని ఒక్కో బ్లాక్‌ను పూర్తిగా వాడుకుంటే ప్రభుత్వరంగ సంస్థలకు నెలకు రూ.28 వేలు, ప్రైవేటు వ్యాపారులు నెలకు రూ.88 వేలు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఈక్రమంలో వేములవాడకు చెందిన మూడు రైస్‌మిల్లర్స్ వారు మూడు బ్లాక్‌లలో ఏడాదిగా నిల్వ ఉంచిన ధాన్యానికి సుమారు 10 లక్షల మేర అద్దె చెల్లించాల్సి ఉంటుందని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే తాము ప్రైవేట్ వ్యాపారులైనప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మాత్రమే నిల్వ చేశామని వ్యాపారులు చెబుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

### సీఎమ్మార్ చేయడంలో అలసత్వం

ప్రభుత్వం రెండేళ్లుగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడానికి జిల్లాలోని పలు రైస్‌మిల్లులకు కేటాయించింది. ఇందులో వేములవాడలోని మూడు రైస్‌మిల్లుల్లో ధాన్యం నిల్వకు స్థలం లేదంటే ఏడాది పాటు ఉచితంగా నిల్వ చేసుకునందుకు బోయినపల్లి మార్కెట్ గోదాంను కేటాయించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు 2022 ఏప్రిల్ నెలతో గడువు ముగిసింది. గడువు ముగిసిన తర్వాత కూడా అదనంగా ఏడాది పాటు ధాన్యం గోదాంలోనే ఉంచారు. అంతేకాకుండా మిల్లర్లు ధాన్యాన్ని మర ఆడించి సీఎమ్మార్ అప్పగించాల్సి ఉంది. కానీ రెండేళ్లుగా ధాన్యాన్ని మర ఆడించకుండా నిల్వ చేసి పెట్టారు.

### ఖాళీ చేయాలని ఆదేశించాం



బోయినపల్లి గోదాంలో వేములవాడకు చెందిన మూడు రైస్‌మిల్లుల నిర్వాహకులు ధాన్యం నిల్వ చేశారు. వారికి ప్రభుత్వం ఇచ్చిన అనుమతి గడువు 2022 ఏప్రిల్ నెలతోనే ముగిసింది. అద్దె చెల్లించి ధాన్యం ఖాళీ చేయాలని డిమాండ్ నోటీసులు అందించాం. వ్యాపారులతో సమావేశం నిర్వహించి ఈనెలాఖరులోగా గోదాం ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశాం. నెలాఖరు వరకు వ్యాపారులు సమయం అడిగారు. గడువు పొడగింపు కాకుంటే అద్దె చెల్లించాలి.

– ప్రవీణ్‌రెడ్డి, డీఎంవో, సిరిసిల్ల

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

**కోనరావుపేట(వేములవాడ):** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరలు లభిస్తాయని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. కోనరావుపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. దళారుల నుంచి రైతులను కాపాడేందుకే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిజామాబాద్‌లోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సర్పంచులు మల్యాల దేవయ్య, గోపు పర్శయ్య, ఎంపీటీసీలు చారి, లింగంపెల్లి లక్ష్మి, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, ఏపీఎం దేవరాజు పాల్గొన్నారు.

**ప్రజాప్రతినిధుల డుమ్మా**

కోనరావుపేటలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టడం చర్చనీయంగా మారింది. జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సర్పంచ్ పోకల రేఖ, సింగిల్ విండో చైర్మన్లు బండ నర్సయ్య, రామ్మోహన్‌రావుతోపాటు ఇతర ముఖ్య నాయకులు హాజరుకాకపోవడం చర్చకు దారితీస్తోంది.

### యువతి అదృశ్యం

**చొప్పదండి:** మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన కొండ మమత(24) అనే మతిస్థిమితం లేని యువతి అదృశ్యమైనట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. మమత కొంతకాలంగా మతిస్థిమితం సమస్యతో బాధపడుతోంది. ఈనెల 21న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పోయింది. కుటుంబ సభ్యులు తెలిసినా చోటల్లా గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై శనివారం తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712670766లో సంప్రదించాలని ఎస్సై కోరారు.



కొండ మమత

### ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గంతో అధ్యక్షుడు శంకర్

**సిరిసిల్లటౌన్:** తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆకునూరి శంకర్ ఎన్నికయ్యారు. సిరిసిల్లలో శనివారం సమావేశమైన సభ్యులు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చుంచు బాలు, ఉపాధ్యక్షులుగా జంగిలి రాజు, కలికోట చందు, మల్యాల ప్రసాద్, దుస్సుల కరుణాకర్, బరిగెల రమేశ్, గడ్డం తిరుపతి, కోశాధికారిగా బత్తుల కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కోటగళ్ల అనిల్, సహాయ కార్యదర్శులుగా దమ్మ శ్రీనివాస్, కొల్లూరి శంకరయ్య, గొర్రె సుధాకర్, మల్లారపు జోసఫ్, సహాయ కోశాధికారిగా సిరిపాక ప్రణయ్, కార్యవర్గ సభ్యులుగా యశ్‌పాల్, తాళ్లపల్లి ప్రశాంత్, రేపాక శంకర్, గుడిసె కిషన్, ఎర్రవెల్లి విష్ణుప్రసాద్, మందల సంజీవ్, దస్తుల నరేశ్, ఉదయ్, శంకర్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్ అభినందించారు.

# ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

**ముస్తాబాద్(సిరిసిల్ల):** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కోరారు. సీపీఐ తలపెట్టిన ఇంటింటికి ప్రజాచైతన్య యాత్ర శనివారం ముస్తాబాద్ చేరుకుంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో యాత్ర సాగుతోందని తెలిపారు. నిరుద్యోగ భృతి చెల్లించాలని కోరారు. సీపీఐ నాయకులు మంద పవన్, మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, మీసం లక్ష్మణ్, సదానందం, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ కుట్రలను తిప్పికొడదాం**

**వీర్నపల్లి(సిరిసిల్ల):** బీజేపీ కుట్రలను తిప్పి కొడదామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర శనివారం సాయంత్రం వీర్నపల్లి చేరుకుంది. వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

**బద్దం ఎల్లారెడ్డి వారసులం..**

**ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):** భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటే ఊరుకోబోమని, బద్దం ఎల్లారెడ్డికి వారసులం మేమేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సీపీఐ ప్రజాచైతన్యయాత్ర శనివారం ఎల్లారెడ్డిపేటకు చేరిన సందర్భంగా మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటి వేణు, వెంకటస్వామి, పవన్, గూడెం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**గృహలక్ష్మి కింద రూ.5 లక్షలు ఇవ్వాలి**

**వేములవాడరూరల్:** ప్రజల పక్షాన ఉంటూ పోరాడేది పార్టీ సీపీఐ మాత్రమేనని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సీపీఐ ప్రజాచైతన్య యాత్ర శనివారం రాత్రి వేములవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ హయాంలోనే దాడులు, నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయన్నారు. ప్రైవేటీకరణ పేరుతో దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతుందన్నారు. దేశంలో 5,907 మంది అవినీతిపరులు రాజ్యమేలుతున్నారన్నారు. రాజకీయ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నిరుపేదలకు స్థలం ఉంటే గృహలక్ష్మి కింద రూ.5లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల కార్యదర్శులు మంద పవన్, మర్రి వెంకటస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు లక్ష్మి, మల్లక్క, పద్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, కేవీ అనసూయ, ఎల్ల దేవరాజు, గాజుల పోచెట్టి, శాంత, నర్సయ్య, పోచమల్లు పాల్గొన్నారు.

**రాజీలేని పోరాటమే ఎజెండా**

**సిరిసిల్లటౌన్:** ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సీపీఐ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల కార్మిక భవనంలో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్‌తో పొత్తులు ఎన్నికలప్పుడేనని స్పష్టం చేశారు. పోడుభూములు, నిరుపేదల నివేశన స్థలాలు, దళితులు, గిరిజనులు, ముస్లింల సంక్షేమానికి నిరంతర పోరాడుతూనే ఉన్నామన్నారు. కేంద్రంలో బీజేపీ పాలన దేశ మనుగడకే ముప్పుగా మారిందన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తన అనారోగ్య భాషను మానుకోవాలని హితవు పలికారు. పార్టీ బలోపేతానికి ప్రజాచైతన్య యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో సీపీఐ పోరాటంతోనే మిడ్‌మానేరు ప్రాజెక్టు వచ్చిందన్నారు. జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మంచికట్ల రమేశ్, సామల మల్లేశం, మంద పవన్, మర్రి వెంకటస్వామి, గూడెం లక్ష్మి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిమర్శ సభ పెట్టుకోవాలి

- డీసీసీ కార్యదర్శి తిరుపతి



రుద్రంగిలో మాట్లాడుతున్న తిరుపతి

**రుద్రంగి(వేములవాడ):** నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరుస్తాడని ఎమ్మెల్యేగా గెలిపిస్తే రమేశ్‌బాబు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. జర్మనీలో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని విమర్శించారు. రుద్రంగిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనం కాకుండా ఆత్మవిమర్శ సభ పెట్టుకోవాలని హితవు పలికారు. పార్టీ గ్రామాధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, నాయకులు పల్లి గంగాధర్, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, ధార్న మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



### విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



మృతి చెందిన గేదె

**గంభీరావుపేట(సిరిసిల్ల):** మండలంలోని దమ్మన్నపేటలో అన్నం నర్సాగౌడ్‌కు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో చనిపోయింది. శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. విద్యుత్ తీగలు గేదెపై పడడంతో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందింది. సంఘటన స్థలాన్ని సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు పరిశీలించారు. రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

### కల్వర్టును ఢీకొట్టిన కారు.. ముగ్గురికి గాయాలు



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

**కథలాపూర్ (వేములవాడ):** మండలంలోని తాండ్ర్యాల గ్రామ శివారులో కల్వర్టును కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ కుటుంబం శనివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు కారులో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తాండ్ర్యాల శివారులో కల్వర్టును వీరి కారు ఢీకొట్టింది. కారులో ఉన్న రాకేశ్, నరేశ్, నంద్ అనే ఐదేళ్ల బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. మండల కేంద్రం నుంచి వేములవాడ వెళ్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నేత గోలి మోహన్ తన వాహనంలో కథలాపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బాధితులు నిర్మల్‌కు వెళ్లారు.

# చనిపోయిన వారికి పింఛన్లు !

- భర్త ఉన్న వారికి ఒంటరి మహిళా పెన్షన్
- అర్హులకు ఎదురుచూపులే..
- పట్టించుకోని అధికారులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ కోనరావుపేట మండలం నిజామాబాద్‌కు చెందిన గుండ లక్ష్మి. ఆమె భర్త 2021 ఆగస్టు 7న మృతిచెందాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. కోనరావుపేట మండల పరిషత్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సైట్ ఓపెన్ కావడంలేదనే సమాధానం వారి నుంచి వస్తుంది.



మృతిచెందిన వ్యక్తి పేరిట జమవుతున్న పింఛన్

**కోనరావుపేట(వేములవాడ):** వృద్ధులకు.. ఒంటరి మహిళలకు.. దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించే ఆసరా పింఛన్ల విషయంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బతికున్న వారు ఏళ్లుగా దరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్నా పట్టించుకోవడం లేదు. చనిపోయిన వారి ఖాతాల్లో మాత్రం డబ్బులు జమవుతూనే ఉన్నాయి. అర్హులకు మాత్రం అందడం లేదు. ఇలాంటి సమస్య జిల్లా వ్యాప్తంగా చాలా మంది ఎదుర్కొంటున్నారు.

**అర్హులకు ఎదురుచూపులే..**

రాజన్నసిరిసిల్ల జిల్లాలో అత్యధికంగా బీడీకార్మికులు ఉంటారు. వీరిలో 2014 తర్వాత పీఎఫ్ ఉన్న కార్మికులకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తుంది. అయితే తర్వాత చాలా మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు చేయలేదు. ఒంటరిమహిళలు.. వృద్ధులు పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా.. ఇప్పటి వరకు ఆ దరఖాస్తులకు అతీ..గతీ లేదు. అదే సమయంలో ఇటీవల చనిపోయిన వారికి పింఛన్‌లు ఆగిపోలేదు. వారి ఖాతాలో జమవుతూనే ఉన్నాయి. అర్హులకు రాకపోగా.. అసలే ప్రాణాలతో లేని వారికి పెన్షన్ జమవుతుండడంపై అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి.

**పింఛన్‌ల వివరాలు..**

| | |
|---|---|
| కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు | 1,435 |
| దరఖాస్తు చేసుకున్న ఒంటరి మహిళలు | 34 |
| కొత్తగా పింఛన్‌ల మంజూరు | 586 |
| తొలగించిన మృతుల పింఛన్‌లు | 140 |

కోనరావుపేట మండలంలోని నిజామాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడు 2021 నవంబర్ 6న మృతిచెందాడు. అంతకుముందు నుంచే అతనికి వృద్ధాప్య పింఛన్ రూ.2,016 వస్తున్నాయి. అతను మృతిచెందినప్పటికీ పింఛన్ మాత్రం ఆగడం లేదు. ప్రతీ నెల అతని ఖాతాలో రూ.2,016 జమవుతున్నాయి. మృతిచెందిన తర్వాత జనన, మరణ రిజిస్టర్‌లో నమోదు చేయాల్సిన అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా 15 నెలలుగా పింఛన్ చనిపోయిన వృద్ధుని ఖాతాలో చేరుతూనే ఉంది.

### ఆ డబ్బులు తీసుకునే అవకాశం లేదు



ఎవరైన మృతి చెందితే వెంటనే వారి పింఛన్‌లు నిలిపివేస్తున్నాం. చాలా రోజుల క్రితం చనిపోయిన వారి వివరాలు మాకు తెలియవు. ఒక వేళ పింఛన్ డబ్బులు వారి ఖాతాలో జమవుతుంటే వాటిని తీసుకునే అవకాశం లేదు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణ, ఎంపీడీవో, కోనరావుపేట